# ప్రశాంతి

రాత్రి తొమ్మిది గంటలవేళ.

"సిస్టర్ ఇప్పుడేంచేద్దాం ? గేటుదగ్గర ఎవరికో ఒంటినిండా దెబ్బలు తగిలాయట. రక్తం వరదలట. మూలుగుతూ పడిపోయాడట. వార్డుబాయ్ లోపలికి తీసుకువచ్చాడు." అన్నది నర్సు.

"ఎందుకు తీసుకువచ్చాడు ? ఈ నర్సింగ్ హోమ్ సంగతి తెలియదా ?" భయపడ్డది సిస్టర్.

''అతడు కొత్తవాడట. పాపం-ఆ పేషంటును చూడగానే జాలేసిందట. వీపుమీద, తలమీద, కాళ్ళమీద అన్నీ దెబ్బలే. రక్తం ధారలు కడుతోంది."

''ఎక్కడున్నాడు పేషంటు ?'' ఆమెలో కొంత కదలిక వచ్చింది.

"ఇప్పుడు స్ట్రెచర్ మీద వరెండాలో ఉన్నాడు."

''అక్కడున్నాడా ? అయ్యో! ప్రమాదం. పదచూద్దాం." ఇద్దరూ స్ట్రెచర్ దగ్గరగా వెళ్లారు.

అతడిని చూడగానే గతుక్కుమన్నది సిస్టర్. వెంటనే స్ట్రెచర్‌ని లోపలికి తీసుకువచ్చి నర్సును గాయాలనన్నిటినీ దూదితో తుడవమని చెప్పి, పల్సుచూసి బాగానే ఉందనుకొని, సిరెంజి లోడ్‌చేసుకువచ్చింది.

"ముందర గాయంపడినచోట స్పిరిట్ దూదిలోముంచి తుడిచి శుభ్రం చెయ్యి. ఆ మందు దూదితో మెల్లగారాయి. తలమీద వెంట్రుకలు కత్తిరించి రక్తమంతా తుడిచి మందురాయాలి" సిస్టర్ అతడికి ఇంజక్షను ఇచ్చింది.

అతడు కళ్లుమూసుకునే మూలుగుతున్నాడు.

"ఇతడిని ఎక్కడుంచాలి ?'' సిస్టర్ ప్రశ్న.

"సిస్టర్. మీరేమీ అనకుండా ఉంటే మన గదిలోఉన్న రెండు మంచాలను ఒకపక్కకు జరిపి. ఇతడికి చాపవేసి దుప్పటి పరుస్తాను. దానిమీద పడుకుని ఇంకోదుప్పటిస్తే కప్పుకుంటాడు. బైటికి రాకుండానే బాత్‌రూమ్‌కి వెళ్ళిరావచ్చు. ఎవరికీ కనబడడు. ఒక రాత్రీపగలూ కాపాడితే గాయాలు కాస్త తగ్గుతాయి. తరువాత పంపెయ్యచ్చు" ఆమె శిక్షణ పొందుతున్న నర్సు. సిస్టర్ అడగగానే వివరంగా చెప్పింది.

"అయినా నాకు భయంగానే ఉంది. కాని-ఏంచేద్దాం ? అతడి పరిస్థితి దయనీయంగా ఉంది. నీవువెళ్ళి చాపమీద దుప్పటివేసి పక్క తయారుచెయ్యి. నేను మెల్లగా స్ట్రెచర్ని మన క్వార్టర్సు దగ్గరికి తీసుకువస్తాను. వెళ్ళు"

ఐదు నిమిషాలలో నర్సు పడక తయారుచేసింది. ఇద్దరూ అతడిని కిందికి దించి పడుకోబెట్టారు. మందురాచి పట్టీలు అంటించినందువల్ల గాయాలు సలుపు తున్నా అతడికి కొంత ఉపశాంతి కలిగినట్టుంది. మెల్లగా కళ్ళుతెరచి చేత్తో కడుపువైపు చూపించాడు.

"నర్స్, మనదగ్గర పాలు ఉంటే కప్పు టీ కలుపు బ్రెడ్‌ముక్కలు డబ్బాలో ఉండాలి చూడు. పాపం ఆకలివేస్తున్నట్టుంది."

నర్సు స్టౌవెలిగించి టీ తయారుచేసింది. బ్రెడ్‌ముక్కలు టీలో ముంచి అతడి నోటికి అందించింది. అతడికి కళ్ళు మూతలుపడేవరకు చూసి గదికి తాళం వేసి, క్వార్టర్సునుంచి నర్సింగ్‌హోమ్‌లోకి వచ్చారు స్ట్రెచర్‌ను తోసుకుంటూ.

అంతవరకూ గుండె గుబగుబ లాడుతునే ఉంది, ఇద్దరికీ. ఎవరయినా చూస్తారేమోననీ డాక్టరికి చెప్తారేమోననీను.

హాల్లో ఒక బెంచిమీద కూర్చుని మెల్లగా మాట్లాడుకుంటున్నారు. మనసులు తేలికపడ్డ తరువాత.

చాటుగా ఈ పని ఇద్దరూ చెయ్యగలిగారంటే-డాక్టర్ అమర్‌సింహ నర్సింగ్‌హోమ్‌లో కేసులన్నీ చూసుకుని, తనరూమ్ తాళంవేసుకుని, రాత్రి ఎని మిది గంటలకు ఇంటికి వెళ్తాడు కనుక. వెళ్ళేటప్పుడే చెప్పాడు-"ఎమర్జెన్సీ వస్తే నాకు ఫోనుచెయ్యండి. ఆ కడుపునొప్పి పిల్లవాడు లేచి మళ్ళీనొప్పిఅంటే సగం మాత్ర ఇవ్వు. నేను రేపుపొద్దున ఎనిమిదిగంటల కల్లా వస్తాను. మత్తుమందిచ్చే

డాక్టర్‌కీ అసిస్టెంటుకూ ఇవాళ ఫోను చేశావుకదా. రేపు ఉదయం పదకొండు గంటలకు అపరేషన్ చెయ్యాలి-తెలుసుగా ?'' అన్నాడు మరొకసారి జ్ఞాపకం చేసినట్టుగా.

''డాక్టర్లు థియేటర్ నర్సుతో కూడా వస్తామన్నారు'' అని జవాబుచెప్పింది సిస్టర్.

''మనగదిలో ఉన్న పేషంటును కాపాడాలి ఎవరూ చూడకుండా" అన్నది సిస్టర్ గుండెమీద చెయ్యివేసుకుంటూ, "వార్డుబాయికి చెప్పరాగానే.''

''అతడికీ తెలుసు జాగ్రత్తగానే ఉంటాడు, కాని ఇతడిని పంపటమెట్లా ?" రహస్యంగా అన్నది నర్సు.

''అదే నేనూ ఆలోచిస్తున్నా. అయినా ఇంకా చాలా టైముంది. రేపు టీ, బ్రెడ్ సర్దుతామనుకో. భోజనం?" సిస్టర్‌కి అభయంలో కలిగిన ఆలోచన.

''గదిలోనే తింటామని ప్లేటల్లో పెట్టి తెచ్చుకోవాలి కిచెన్‌లోనుంచి-కొంచెం ఎక్కువగా తెస్తే సర్దుకోవచ్చు. రాత్రికూడా అలాగేచెప్పి కిచెన్‌లో నుంచి తీసుకురావటం ఏం కష్టంకాదు. పంపించటమెట్లా అన్నదే పెద్దసమస్య. కాళ్ళకు దెబ్బలు బాగా తగిలాయి. గేటులోనుంచి మెల్లగా నడిచివెళ్తాడా అంటే వాచ్‌మన్ స్టూలువేసుకుని అక్కడే కూర్చుంటాడు. పెరటివైపు మరొకదారి లేదు.'' అంది నర్సు.

"అయితే ఒకపని చెయ్యవచ్చు. మనగదిలో ఉన్నస్టూలు గోడదగ్గరగా వేస్తే మెల్లగా గోడ ఎక్కుతాడు కాని అటువైపు దిగటమెట్లా ? చెత్తా గాజు పెంకులూ ఉంటాయి దూకితే. అతడికి కాళ్ళకు చెప్పులయినా లేవు.'' అంది సిస్టర్.

''మళ్ళీ ఆలోచిద్దాం రేపు. తెల్లవారనీ'' అంది నర్సు.

ఇద్దరూ అక్కడఉన్న బల్లలమీద ఒరిగారు.

కడుపునొప్పి పిల్లవాడు అనుకున్నట్టుగా లేచాడు నొప్పిఅంటూ. అతడికి సగంమాత్ర ఇచ్చి మంచినీళ్ళిచ్చింది నర్సు. ఇలా గంటకొక రౌండు తిరుగుతూ తెల్లవారుఝామున ఐదుగంటలకు అందరికీ టెంపరేచరు చూసి వచ్చింది నర్సు.

ఆరుగంటల లోపల-అందరినీ లేపి ముఖాలు కడుక్కోమన్నది-హాల్లో ఉన్న రోగులు పదిమందినీ గదుల్లో ఉన్నవాళ్లు ఒక పదిమంది. వాళ్ళతో కూడా ఇద్దరు అటెండెంట్సు ఉంటారు. వాళ్ళు ముఖాలు నీళ్ళగదుల్లో కడుక్కుని టీ చేయించుకుని తాగుతారు. హాల్లోఉన్న పదిమందీ డబ్బు తక్కువ ఇస్తారు కనుక వాళ్ళకు నర్సింగ్ హోమ్‌లోనే టీ చేయించి ఇస్తారు.

తెల్లవారి ఏడున్నరకు పగటి డ్యూటీకి ఒక సిస్టర్, ఒక శిక్షణ పొందుతున్న నర్సువస్తారు. నైట్ డ్యూటి చేసినవాళ్లు ఆ కాంపౌండులో ఉన్న తమ క్వార్టర్సుకు వెళ్ళిపోతారు.

సిస్టర్ శాంతమణి ఇంగ్లీషు తెలుగు హిందీ భాషలు మాట్లాడుతుంది. తన చేతిక్రింద నర్సుకు పనినేర్పుతున్నది. వాళ్ళ క్వార్టర్సు అంటే ఒక రెండుమంచాలు పట్టేటంతటి విశాలమైనగది ఒకటి, దానిపక్కన చిన్న కిచెన్, దానికి పక్కగా బాత్‌రూమ్ ఉన్నాయి. ఈ మూడిటికీ ఒకదానిలో నుంచి మరొకదానిలోకి వెళ్ళటానికి దారులున్నాయి.

తెల్లవారిన తరువాత ఎవరికీ కనబడకుండా ఉండటానికి చాపను ఒక మూలకు ఇద్దరూ పట్టిలాగారు. అతడు మెల్లగాలేచి ముఖం కడుక్కున్న తరువాత బ్రెడ్ టీ తెచ్చిఇచ్చారు. అతడికి మాత్రయిచ్చి కదలకుండా పడుకొని దుప్పటి కప్పుకోమన్నారు.

అతడు లేవగానే వాళ్ళకు దణ్ణంపెట్టాడు.

"నొప్పి తగ్గిందా ?" మెల్లగా అడిగింది సిస్టరు.

"కొంత తగ్గింది."

"నొప్పి తగ్గటానికి మాత్ర మళ్ళీఇస్తాను. డాక్టరుగారికి తెలియకుండా మేము నీకు మందు లిస్తున్నాం. తెలిస్తే మా ఉద్యోగాలు ఊడిపోతాయి." అన్నది సిస్టరు.

ఆమాట కతడు భయపడ్డాడు.

''నిజమా దొరసానీ ?''

''అవును. ఆయన అందరినీ చేర్చుకోరు. అదొక రకం మనిషి. రేపు తెల్ల

వారకుండా నీకు కావలసిన మందులు, గాయాలు తుడుచుకోవటానికి దూది స్పిరిట్ అన్నీయిచ్చి పంపిస్తాం. అదికూడా పెరటి వైపున్న గోడమీదినుంచి. నీవు జాగ్రత్తగా స్టూలు ఎక్కి, గోడమీద కూర్చో, అటువైపు దిగటానికి ఒక బల్లచెక్క వేస్తాం. మెల్లగా దిగు. నీకు త్వరలోనే గాయాలు మానిపోతాయి. ఏమంటావు ?"

''సరేనమ్మా. నేను ఎంతో పుణ్యం చేసుకున్నాను కనుక మీకంటపడ్డాను. మీరిద్దరూ చిన్నవాళ్ళయినా నాకు తల్లులవంటివాళ్ళు. నేను ఎప్పుడూ తలుచుకుంటాను. అమ్మా సెలవు" అన్నాడు.

ఉదయం సరిగా ఎనిమిది గంటలకు డాక్టర్ అమర్‌సింహ వచ్చాడు. అప్పుడే ఒక లేడీడాక్టరు వచ్చి తన రోగులిద్దరినీ అంటే బాలెంతలిద్దరినీ పుట్టిన బిడ్డలనుచూసి ''బాగానే ఉన్నారు." అన్నది.

"అయితే ఎప్పుడు వెళ్ళమంటారు ?" అని మొదటి గదిలోని బాలెంత అటెండెంటును అడిగింది. "కుట్లువిప్పాలి. తొమ్మిదవ రోజయిన తరువాత తీసుకు వెళ్ళండి."

రెండవ గదిలోఉన్న బాలెంతను "మీరెప్పుడయినా వెళ్ళండి. మందులు రాసిస్తాను" అంటూ రాసియిచ్చింది

ఆమె వెళ్ళిపోయిన తరువాత డాక్టరు అమరసింహ తన రోగులను చూడటానికి వెంబడి సిస్టర్నుకూడా రమ్మన్నాడు.

డాక్టర్ అమర్‌సింహ నర్సింగ్‌హోములో రోగులను గురించి ముందు సిస్టర్ని అడిగి, తరువాతనే తను చూస్తాడు. అందరినీ చూసి కొందరికి మందులు రాసిచ్చి ఇంటికి వెళ్ళమన్నాడు. కొందరిని ఇంటికివెళ్ళి నాలుగురోజుల కొకసారి వచ్చి చూపించుకోమన్నాడు. చివరకు కడుపునొప్పి పిల్లవాడి దగ్గరకొచ్చాడు.

అప్పుడు సరిగ్గా తొమ్మిది గంటలు.

"నీకేం భయంలేదు. ఒకగంట కళ్ళుమూసుకుని పడుకున్నావంటే నీవులేచి చూసుకునేసరికి అంతా అయిపోతుంది. కడుపునొప్పి మళ్ళీరాదు. హాయిగా ఉంటావు. భయపడకు" అంటూ వెన్నుతట్టి తనగదిలోకి వెళ్ళాడు.

కాగితాలు బిల్సు రసీదులూ చూసుకుంటూ ఉండగా ఒక టెలిఫోను వచ్చింది. సంభాషణ ఒకగంటసేపు నడిచింది. "పదకొండు గంటలకు ఆపరేషన్ కనుక డాక్టర్లు వస్తారు" అనుకున్నాడు.

టెలిఫోను సంభాషణ అయిన తరువాత డాక్టరు అమర్‌సింహ ముఖమంతా ఎర్రబడ్డది. క్రోధావేశంలో కాళ్ళు చేతులూ వణకటం మొదలుపెట్టాయి. విసురుగా హాల్లోకివెళ్ళి "మీ అబ్బాయికి నేను ఆపరేషన్ చేయటంలేదు. ఇంటికి తీసుకు వెళ్ళండి" అన్నాడు ఎర్రబడిన కళ్ళతో.

పిల్లవాడితో వచ్చినవాళ్ళు విభ్రాంతులైపోయారు. ఐదు నిమిషాల క్రిందటి వరకూ అబ్బాయి ఆపరేషన్ చేయించుకుని సుఖంగా ఉంటాడని సంతోషపడుతున్నారు వాళ్ళు.

ఇంతలోకీ ఏమయింది ?

"నిన్న—మీరేకదండీ ఆపరేషన్ చేస్తానన్నారు ? గంటక్రిందట కూడా "నీకేంభయం లేదని వెన్నుతట్టారు ? మేము మీరు అడిగినంత డబ్బుఇస్తాం. వీడు కడుపునొప్పి భరించలేక విలవిల్లాడిపోతున్నాడు. అయ్యా, డాక్టరుగారూ ! మీ కాళ్ళు పట్టుకుంటాము. మీరు ఆపరేషనుచేస్తే పిల్లవాడు బాగుంటాడని ఆశపడి ఇంతదూరం వచ్చాం. మీచెయ్యి మంచిదని విని వచ్చాము. ఆపరేషన్ చేసి పంపండి బాబూ !"

వాళ్ళల్లో ఒకరు డాక్టరుకాళ్లు పట్టుకున్నాడు.

దూరంగా జరుగుతూ "మొదలు చేద్దామనుకున్నాను. తరువాత బాగా ఆలోచించుకున్నాను. నేను చెయ్యను. గవర్నమెంటు హాస్పిటల్ కి తీసుకు వెళ్లండి. మీలాటివాళ్ళకు అసలు చెయ్యను. వెళ్ళండి"

"ఎందుకు ? డాక్టర్. మేమేం చేశాం ? రోగులందరికీ మందులిస్తామనే బోర్డు పెట్టుకున్నారు. మేమేదయినా తప్పుచేస్తే క్షమించండి. పిల్లవాడు అలమటించి పోతున్నాడు. వాడి ముఖంచూసి అయినా అంగీకరించండి బాబూ !"

"మీరు గవర్నమెంటు హాస్పిటల్ కి వెళ్ళండి. డబ్బు-ఖర్చుకూడా తక్కువవుతుంది. అక్కడ అన్నీ బాగా జరుగుతాయి. వెళ్ళండి. నేను చెయ్యనంటేచెయ్యను. అంతే" తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

డాక్టర్ అరుపులు - పెరట్లో గాయపడిన రోగిని గోడదాటించిన సంతోషంతో కబుర్లు చెప్పుకుంటూ బెంచీమీద కూర్చున్న నర్సుకూ సిస్టరుకూ వినబడుతునే ఉన్నాయి.

వాళ్ళకు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

కడుపునొప్పి వచ్చిన పిల్లవాడిని తీసుకునివాళ్ళంతా వెళ్ళిపోయారు ముఖాలు ముడుచుకుని. ఏడుస్తూ నర్సింగ్‌హోమ్‌కు డబ్బు చెల్లించి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ ఇంకా పిల్లవాడిని చేర్చకముందే విలవిలతన్నుకుని అతడు ప్రాణాలు విడిచాడు.

డాక్టరు అమర్‌సింహ గదిలోకివెళ్ళి ఏడుస్తూ తలపట్టుకుని ఏడుస్తున్నాడు.

సర్జన్‌కోసం వెళ్ళిన పిల్లవాడి మేనమామ ఇంకా తిరిగిరాలేదు. ఏమిటీ దుర్గతి.

డాక్టర్ అమర్‌సింహ మంచి అనుభవంగల డాక్టరు. తండ్రికోరిక మేరకు స్వగ్రామంలోనే ప్రాక్టీసుచేశాడు. ఆయన చనిపోయిన తరువాత ప్రభుత్వోద్యోగంలో చేరాడు.

అతడిని మొదటిసారిగా గిరిజన ప్రాంతంలో వేశారు. గిరిజనులకు డాక్టర్ల మీద వారిచ్చే మందుల మీద నమ్మకం లేదు. హాస్పిటల్‌కి ఎవరూ వచ్చేవారుకాదు.

డాక్టరు అమర్‌సింహ అక్కడ ఉండగానే కలరా వ్యాధి అన్ని ఊళ్ళకూ వ్యాపించింది. ప్రజలకు కలరా టీకాలు వేయవలసిందని ఆరోగ్యశాఖ మందులు పంపించింది. అమర్‌సింహ ఉన్న ఊళ్ళో కూడా కలరా వ్యాపించి జననష్టం జరిగింది. అతడు కంపౌండరును తీసుకుని ఇంటింటికీ వెళ్ళాడు' వాళ్ళు స్వయంగా తీసుకున్న మందులవల్ల ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో సగం మందికి పైగా చనిపోయారు. ఆ సంగతి గ్రహించని ప్రజలు అతడిని చూడగానే తలుపులు వేసుకోవటం మొదలు పెట్టారు.

ఆమర్‌సింహ ప్రభుత్వాజ్ఞ ననుసరించి కనబడిన వారందరికీ కలరా టీకాలు బలవంతంగా ఇచ్చాడు. రోగులను తీసుకు వెళ్ళి వైద్యం చేశాడు.

ఈ వ్యాధి-ఈ జననష్టం. ఈ డాక్టరు వల్లనే నన్న దురభిప్రాయంతో ఉన్నారు అక్కడి ప్రజలు.

అమర్‌సింహ ఆచుట్టు ప్రక్కల గ్రామాలన్ని తిరిగి ఇంటికి వచ్చేసరికి పొద్దు పోయింది, అప్పటికి అతడు ఉంటున్న ఇల్లు మంటలతో నిండిపోయింది. మంటలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంటిలోపల అతడి భార్య ఇద్దరు బిడ్డలు మంచాలమీద నిద్రపోతున్నారు. ఆ మంటలలోకి వెళ్ళటానికి ఎవరూ సాహసించ లేదు. ఆ మంటలు తగ్గుముఖం పట్టిన తరువాత లోపలికి వెళ్ళి వాళ్ళు మాడి మసి బొగ్గులయిన ఆయన భార్య బిడ్డలను బైటికి తీసుకువచ్చారు.

డాక్టర్ అమర్‌సింహ నిర్జీవుడై కూలబడి పోయాడు.

ఇది గ్రామ ప్రజల వల్ల జరిగిన ఘోర కార్యమని ప్రభుత్వాధికారులు నిశ్చయించారు. అతడు ప్రభుత్వాజ్ఞమేరకు డాక్టరుగా వ్యాధి నిరోధక చర్యను తీసుకోవటానికి వెళ్ళాడు గాని అందరినీ చంపటానికి వెళ్ళలేదు. కాని వాళ్ళ వైముఖ్యం ఎదురయింది.

అతడికి దుఃఖంతోపాటు పట్టరాని ఆవేశం వచ్చింది.

వెంటనే ప్రభుత్వానికి విషయం తెలియచేస్తూ తన రాజీనామాను సమర్పించాడు.

కొంతకాలం పిచ్చివాడిలా దేశాలు పట్టుకుని తిరిగాడు.

చివరకు ఈ నగరం వచ్చి ఒక నర్సింగ్‌హోమ్ పెట్టుకుని వైద్యం చేస్తున్నాడు. ఒక చిన్న ఇల్లు తీసుకుని దానిలో ఒక్కడే ఉంటాడు.

అతడి మనస్సులో తిష్ఠవేసుకుని కూర్చున్న భార్యా బిడ్డలను తలుచుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

డాక్టరు అమరసింహ మిత్రుడొకడు ఉత్తర హిందుస్థాన్‌లో ఉంటాడు. అతడికి విషయం ఆలస్యంగా తెలిసి కాంతివేగంతో వచ్చాడు.

"నేనిక్కడున్నానని నీకెట్లా తెలిసింది?" అన్నాడు ఆశ్చర్యపోతూ అమర్‌సింహ.

''ఏదో విధంగా తెలిసింది. పది సంవత్సరాలకు పైగా జరిగిన ఆ సంఘటనలను నీవు ఇంకా మర్చిపోలేదా?'' అడిగాడు.

''కాలం మరపింపచేస్తున్నది. కాని నా బిడ్డలు నాభార్య మాడిపోయిన దృశ్యాన్ని మాత్రం మరచిపోలేకుండా ఉన్నాను. నేను మామూలు మనిషిని. నాలో మమతలు మాసిపోలేదు. రాగద్వేషాలకు అతీతుడను కాలేదు. కాలేనేమో కూడా?"

"నీవు ఆర్జించిన విద్యకు న్యాయం చేకూర్చాలి. నీ విద్య నలుగురికి ప్రాణదానం చేసేది. వైద్యుడికీ దైవానికీ భేదము ఎక్కడుందో తెలుసా? నీవు ప్రాణాలను చివరి వరకూ రక్షించాలని చూస్తావు. కాని నిలపలేవు. మానవులకు చేతకాని పని ప్రాణం పోయటం. ఆపని దైవం చేస్తాడు.''

"ఆ మాట నేను ఒప్పుకున్నానుగా."

"ఒప్పుకున్నవాడివి గ్రామీణుల కెందుకు వైద్యం చెయ్యవు? నీ విద్యను నీవు దాచుకోవటానికా? నీ కిష్టమైన వాళ్ళకు వైద్యం చేయటానికా? పల్లీయులు నిన్ను నమ్మలేదంటే వాళ్ళకు నీమీద కోపంచేత కాదు. ఇది అజ్ఞానానికీ జ్ఞానానికీ మధ్య గల పోరాటం. ఈ పోరాటంలో జ్ఞానానిదే పై చెయ్యని నీవు నిరూపించాలి. వైద్యుడికి రాగద్వేషాలు పనికిరావు. అందరూ నీ దృష్టిలో సమానులే ననిపించుకోవాలి. అన్నిటికంటే నేను ముఖ్యంగా వచ్చింది ఎందుకంటే నిన్ను గృహస్థుడిని చేయటానికి" అన్నాడు మిత్రుడు.

''ఇప్పుడు నాకు పెళ్లేమిటి? మనసు చచ్చి పోయిన వాడికి పెళ్ళెందుకు?"

''ఎందుకా? నీ మనసును మళ్ళీ చిగురింప చేయటానికి. నీ మనసు చిగురించి పుష్పించితే గాని నీకు నీ రోగులమీద రాగద్వేషాలు నశించవు.

నీకు మనసు ప్రశాంతంగా ఉంటే గాని నీవు వాటికి అతీతుడవు కాలేవు."

"అన్నీ పోగొట్టుకున్న ఈ మోడును ఏ పిల్ల చేసుకుని సుఖపడుతుంది? మళ్ళీ రాగ ద్వేషాలు మరొక రూపంలో ఉద్భవిస్తాయి."

నీలోని రాగద్వేషాలను నశింపచేసి-నిన్ను తిరిగి విద్యార్థిగా ఉన్న అమరసింహను చేయగల ప్రశాంతిని నేను నా వెంట తీసుకువచ్చాను. ఆమె గెస్టు

హవుస్‌లో ఉంది. మిమ్మల్నిద్దరిని కలిపి దండలు మార్పించి గాని నేను ఈఊరు నుంచి కదలను." అంత పట్టుదలతో ఉన్నాడు మిత్రుడు.

"నీకు ఆశాభంగం కలుగుతుందేమో?"

"నీవు వైద్యశాస్త్రంలో ప్రవీణుడవైతే మా ప్రశాంతి మనసులో ఉన్న అశాంతినీ పోగొట్టే విద్యలో ప్రవీణురాలు నీవు ఊఁ అను. టెలిఫోను చేసి పిలిపిస్తా. ఎంత చదువుకున్నా మనం వాళ్ళముందు విద్యార్థులం రా.''

"నాచెయ్యేందుకు మళ్ళా? ఆ మాటేదో నీవే ఫోను చెయ్యి" అన్నాడు. డాక్టరు అమర్‌సింహ.

ప్రశాంతి కదిలి వచ్చింది. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ. ఆమె వెనుకనే వచ్చింది మలయమారుతం వాతావరణాన్ని మార్చివెయ్యటానికి.

❋❋